ఏటి కాలువకు వరదొస్తే ఏటా కష్టాలే

- ఇటీవల వరదకు తెగిపోయిన ఏటి కాలువ
- సీసీతో పటిష్టంగా నిర్మించాలంటున్న రైతులు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 15 : బొంరాస్‌పేట పెద్ద చెరువులోకి వరద నీరు రావడానికి ప్రధాన ఆధారం ఏటి కాలువ. రైతులకు జీవనాధారంగా ఉన్న బొంరాస్‌పేట పెద్ద చెరువు ఏటా నిండాలంటే ఏటి కాలువ ద్వారా వచ్చే వరద నీరే ఆధారం. అలాంటి ఏటి కాలువకు ఏటా వర్షాకాలం సమయంలో వరదలు వస్తే కాలు తెగిపోతుంది. నీరంతా వృథాగా పోయి చెరువు నిండకుండా పోతుంది. ఏర్పుమళ్ల కాకరవాణి ప్రాజెక్టు నిండితే దాని అలుగు ద్వారా వచ్చే నీరు ఏటి కాలువ ద్వారా బొంరాస్‌పేట చెరువులోకి చేరుతుంది. అయితే భారీ వర్షాలు కురిస్తే వరద ఎక్కువై ఏటి కాలువ తెగిపోతుంది. మట్టితో నిర్మించిన కాలువ కావడంతో ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా కాలువ తెగిపోతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏటి కాలువకు వరద భారీగా రావడంతో రెండుసార్లు తెగిపోయింది. రైతులు వెళ్లి జేసీబీ సహాయంతో తెగిపోయిన చోట మరమ్మతులు చేపట్టినా మళ్లీ తెగిపోయింది. ఏటా వర్షాల సమయంలో రైతులకు ఈ ప్రయాస తప్పడం లేదు. ప్రస్తుతం చెరువు నిండడంతో ఏటి కాలువను ఎవరూ పట్టించుకోవడం లేదు. వచ్చే ఏడాదికైనా ఏటి కాలువను సీసీతో పటిష్టంగా నిర్మిస్తే ఎంత వరద వచ్చినా తెగిపోకుండా ఉంటుందని, చెరువు త్వరగా నిండడానికి ఆస్కారం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. బొంరాస్‌పేట పెద్దచెరువు నిండితే దాని కింద వెయ్యికిపైగా ఎకరాల ఆయకట్టు సాగవుతుంది

ఇటీవల భారీ వర్షాలకు తెగిపోయిన ఏటి కాలువ

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేక పూజలు..

వికారాబాద్, సెప్టెంబర్ 15: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ప్రతిష్ఠించిన వినాయకులకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరారు. స్పీకర్ వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

జొన్న పంట దిగుబడి అంచనా..

జొన్న పంట దిగుబడిని తూకం వేస్తున్న గణాంక అధికారులు

దోమ, సెప్టెంబర్ 15: ప్రతి రైతూ పండించిన పంట దిగుబడి అంచనా వేసుకొని దానికి అనుగుణంగా తదుపరి పంటల సాగుపై తగిన జాగ్రత్తలు తీసుకొని మంచి దిగుబడులు సాధించే దిశగా కృషి చేయాలని కేంద్ర గణాంక అధికారి జితేందర్‌ర్ అన్నారు. మండల పరిధిలోని బుద్లాపూర్ గ్రామానికి చెందిన రామ్‌దాస్ సాగు చేసిన జొన్న పంట దిగుబడిని పరిగి డివిజన్ గణాంక అధికారి సందీప్‌రెడ్డితో కలిసి కేంద్ర గణాంక అధికారి జితేందర్ ఆదివారం పంట దిగుబడిని అంనా వేశారు. పంట పొలంలో ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పు తీసుకొని కోత కోసి జొన్న పంట దిగుబడిని తూకం వేయగా ఒక కిలో ఎనిమిది వందల డెబ్బై కిలో గ్రామలు వచ్చిందన్నారు.మంచి దిగుబడి వస్తే ఎకరాకు ఆరు నుంచి ఎనమిది క్వింటాలు వస్తుందన్నారు. అధిక వర్షాల కారణంగా దిగుబడి తగ్గి రైతుకు నష్టం వాటిల్లిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గణాంక అధికారులు, రైతు రామ్‌దాస్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు లయన్స్ క్లబ్ సన్మానం

పెద్దేముల్, సెప్టెంబర్ 15 : లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పట్టణంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా పెద్దేముల్ మండలం మంబాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న సరిత ను అలాగే గతంలో పెద్దేముల్ మండలంలో విధులు నిర్వహించి ప్రస్తుతం యాలాల మండలంలోని అగ్గనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న నిర్మలను సన్మానించారు. వీరిని తోటి ఉపాధ్యా యులు, ఆయా పాఠ శాలల ప్రధానోపాధ్యాయులు, పీఆర్‌టీయూ సంఘాల ప్రతినిధులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లయన్ డా.కోటేశ్వర్‌రావు, ప్రముఖ కవి ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, తాండూరు నియోజకవర్గ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రొంపల్లి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి అసద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

దోమ/పరిగి, సెప్టెంబర్ 15: ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. సీపీఎం పరిగి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పరిగి పట్టణంలో పార్టీ మూడవ మహాసభలను నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు సీపీఎం కార్యాచరణ ఉంటుందన్నారు.ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న విధి విధానాలపై తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శులు హబీబ్, రాజేందర్, యాదగిరి, లాలప్ప, అనీల్, రాంచంద్రయ్య, ప్రశాంత్, వెంకటయ్య రమేశ్ పాల్గొన్నారు.

రాయదుర్గంలో రోడ్డు ప్రమాదం

- మహిళ మృతి.. నలుగురికి గాయాలు
- రాయదుర్గం పీఎస్ పరిధిలో ఘటన

రత్నాబాయి (ఫైల్)

దోమ/పరిగి, సెప్టెంబర్ 15: పరిగి మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా లడ్డూ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు పోటీలో పాల్గొనగా నసీర్ అనే యువకుడు రూ.75000/ వేలంపాటపాడి గణేశ్ లడ్డూను దక్కించుకున్నాడు. అనంతరం గ్రామస్తులకు లడ్డూను పంపిణీ చేశాడు. కార్యక్రమంలో గ్రామ యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 15: ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి.. పక్కనే ఆగి ఉన్న వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందగా.. మరో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. టొలిచౌకీ షేక్‌పేట వైపు నుంచి ఆదివారం ఉదయం గచ్చిబౌలి వైపు ప్రయాణికులతో వెళ్తున్నది. ఈ ఆటో రాయదుర్గం మల్కంచెరువు సమీపంలోకి రాగానే షేక్‌పేట ఫ్లై ఓవర్ పైనుంచి వచ్చిన ఓ స్కూటీని తప్పించబోయి రోడ్డు పక్కన ఆగి ఉన్న జైలో వాహనాన్ని ఢీకొట్టి, పల్టీలు కొట్టి నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న రత్నాబాయి(38) అనే మహిళ మృతిచెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పోలీసులు ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. చత్తీస్‌గఢ్ నుంచి నగరానికి బతుకుదెరువు కోసం వచ్చి రత్నాబాయి ఫిలింనగర్‌లోని అంబేద్కర్ చౌరస్తా ప్రాంతంలో ఉంటున్నట్టు పోలీసులు గుర్తించారు. రత్నాబాయితో పాటు మిగతా వారంతా రాయదుర్గంలోని పీడబ్ల్యూసీ కంపెనీలో హౌజ్‌కీపింగ్ కార్మికులని పోలీసులు పేర్కొన్నారు. ఆటోలోప్రయాణిస్తున్న వారితో పాటు స్కూటీ డ్రైవింగ్ చేస్తున్న ఉప్పల్ నివాసి మహ్మద్ షకీల్ కూడా గాయపడినట్టు పోలీసులు తెలిపారు. రత్నాబాయి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవాబుపేట, సెప్టెంబర్15:నవాబుపేట మండల కేంద్రంలో ఆదివారం 2005-2006 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యా ర్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరికొకరు గుర్తు చేసుకున్నారు. అనంతరం తమ గురువులను శాలువాలు, పూలమాలతో సత్కరించారు. కార్య క్రమంలో అప్పటి హెచ్ఎం. మల్లారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, విష్ణు, బ్రహ్మానందారెడ్డి, చంద్రయ్య, విద్యార్థులు మధుకర్‌రెడ్డి, శంకర్, నగేశ్, రమేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద్దేముల్, సెప్టెంబర్ 15 : వినాయకుడి ఆశీస్సులతో రేగొండి గ్రామ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మాజీ సర్పంచ్ హైదర్ అన్నారు. ఆదివారం వినాయక నిమజ్జనంలో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో రూ.45 వేలకు లడ్డూను కైవసం చేసుకున్నాడు. ఈ లడ్డూను ప్రతి ఇంటికీ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మతసామరస్యాన్ని కాపాడుతూ, వినాయక ఉత్సవాల్లో పాల్గొని లడ్డూను కైవసం చేసుకొన్న హైదర్‌ను పలువురు అభినందించారు.

దోమ/పరిగి,సెప్టెంబర్ 15 : పరిగి పట్టణంలోని సిద్ధాంతి కాలనీలో ప్రతిష్ఠించిన వినాయక మండపం దగ్గర మిట్టకోడూరు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఉస్మాన్ అలీ బాల బాలికలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సొంత డబ్బులతో బహుమతులను అందజేశారు. దీంతో కాలనీ వాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు రవీందర్, సాయిబాబా, నర్సింహులు, శంకర్ రావు, సందీప్‌కుమార్, అనిల్‌కుమార్, కేశవులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశృతి

చెరువు నీటిలో మునిగి ట్రాక్టర్ డ్రైవర్ మృతి

మేడ్చల్, సెప్టెంబర్15: వినాయక నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకుంది. నిమజ్జనం చేసేందుకు వెళ్లిన ట్రాక్టర్ డ్రైవర్‌పై వినాయక విగ్రహం పడటంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మేడ్చల్ మండల పరిధిలోని రాజొల్లారం తండాకు చెందిన లక్ష్మణ్ (28) ట్రాక్టర్ డ్రైవర్. తండాలో ప్రతిష్ఠించిన వినాయకుడిని పటేల్ చెరువులో నిమజ్జనం చేసేందుకు స్థానికులతో కలిసి వెళ్లాడు. నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు అతడిపై వినాయక విగ్రహం పడింది. దీంతో నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాలానగర్‌లో ర్యాపిడో బైక్ రైడర్ హత్య

బాలానగర్, సెప్టెంబర్ 15: ఐడీపీఎల్ అటవీప్రాంతంలో ర్యాపిడో బైక్ రైడర్ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఆదివారం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. కుత్బుల్లాపూర్ పరిధిలోని రంగారెడ్డినగర్ డివిజన్ పంచశీలకాలనీలో నివాసి కాలె దినేశ్ (32) ర్యాపిడో బైక్ రైడర్‌గా, స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. ఆదివారం ఐడీపీఎల్ అటవీ ప్రాంతంలో మృతదేహం కనిపించింది. బాలసారుల సమాచారంతో బాలానగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. మృతుడి చెవులు, ముక్కు నుంచి రక్తం కారుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దినేశ్ అటవీ ప్రాంతానికి ఎందుకు వెళ్లాడు..? అక్కడ ఏం జరిగింది..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేవని, దినేశ్ ఫోన్ కాల్ డేటా ఆధారంగా కేసు ఛేదించే పనిలో ఉన్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కందుకూరు, సెప్టెంబర్ 15: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కందుకూరు పోలీస్ స్టేషన్ ఎస్సై సైదులు కథనం ప్రకారం.. మండల పరిధిలోని కొత్తగూడ గ్రామానికి చెందిన జంగయ్య (50) శనివారం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు బయలుదేరాడు. శ్రీశైలం రహదారిపై వెళ్తుండగా నేదునూరు గేటు సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన తెల్లటి రంగున్న గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. దీంతో జంగయ్యకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

దోమ/ పరిగి, సెప్టెంబర్ 15: గణేశ్ నిమజ్జన కార్యక్రమాలకు విధులు నిర్వహించేందుకు వచ్చిన ప్రత్యేక పోలీసు బలగానికి పరిగి పోలీసుస్టేషన్ ఆవరణలో ఆదివారం ఎస్సై సంతోష్ కుమార్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులతో పాటు గా అన్ని శాఖల అధికారులతో కలిసి పనిచేసి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని పేర్కొన్నారు. పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్సై సంతోష్‌కుమార్, ఏఎస్సై కృష్ణ, సిబ్బంది ఉన్నారు.

హనుమాన్ దేవాలయ కమిటీ ఎన్నిక

దోమ,సెప్టెంబర్ 15: మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి నూతన హను మాన్ దేవాలయ కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ చైర్మన్‌గా రాజేశ్వరమ్మ, వైస్ చైర్మన్‌గా డి. నర్సింహులు, ప్రధాన కార్యదర్శులుగా మొగుల య్య, చెన్నయ్యను ఎన్నుకోగా సెక్రటరీగా మల్లేశ్, సాంస్కృతిక కమిటీ చైర్మన్‌గా గెరిగంటి కృష్ణయ్య, కోశాధికారిగా శివకుమార్‌తో పాటు మరి కొంత మందిని సహాయ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

గణేశ్ నిమజ్జనంలో డీజేల నిషేధం..

కొడంగల్, సెప్టెంబర్ 15: గణేశ్ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే నిమజ్జన కార్యక్రమంలో డీజేలు నిషేధించినట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే విధంగా ఉత్సవ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు

రజక ఉద్యోగ, ఉపాధ్యాయ నూతన కార్య వర్గం

తాండూరు రూరల్, సెప్టెంబర్ 15 : తాండూరు రజక ఉద్యోగ, ఉపాధ్యాయ నూతన కార్య వర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సుధాకర్ (టీచర్), అధ్యక్షుడిగా ఐనెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఆర్.రమేశ్, మహిళా అధ్యక్షురాలిగా సంధ్యారాణి, కోశాధికారిగా రాములు, కార్యదిర్శగా వెంకట్, మహిళా కార్యదర్శులుగా టి.అనురాధను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో టీచర్ నాగప్ప ఉన్నారు.

వాహనం ఢీకొని ఒకరి మృతి..

బండ్లగూడ, సెప్టెంబర్ 15 : కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. హసన్‌నగర్‌కు చెందిన మోసిన్(44), మరో వ్యక్తితో కలిసి బైక్‌పై ఆరంఘర్‌వైపు వెళ్తున్నాడు. పిల్లర్ నంబర్ 266 వద్దకు రాగానే వెనక నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో మోసిన్ కిందపడి తీవ్ర గాయాలతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తప్పతాగి స్టీరింగ్ పట్టి..

- ఎస్ఆర్ నగర్‌లో కారు బీభత్సం
- మూడు బైకులు ధ్వంసం
- సూపర్ మార్కెట్లోకి దూసుకెళ్లిన కారు
- నిందితుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
- మద్యం పరీక్షల్లో 550 పాయింట్లుగా నమోదు
- నిందితుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్ సెప్టెంబర్ 15: పీకల దాకా తాగాడు.. ఆ మద్యంలోనే కారు డ్రైవింగ్ చేశాడో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అతి వేగంతో దూసుకొచ్చిన అతడి కారు ఎస్ఆర్ నగర్‌లోని ట్రాఫిక్ పీఎస్ మలుపు వద్ద అదుపుతప్పింది. మూడు బైకులను ఢీకొట్టుకుంటూ.. సూపర్ మార్కెట్‌లోకి దూసుకెళ్లింది. ప్రాణ భయంతో అక్కడున్న ప్రజలు అటూ ఇటు పరుగులు తీశారు. కారు నడిపిన వ్యక్తికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేయగా.. మద్యం మత్తులో ఉన్నట్టు తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వెంగళరావునగర్‌కు చెందిన రవి(45) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇటీవలే జాబ్ మానేశాడు. ఆదివారం రవి పుల్లుగా మద్యం తాగాడు. అ మత్తులోనే కారు స్టీరింగ్ పట్టి డ్రైవింగ్ చేశాడు. అతివేగంతో దూసుకొచ్చిన అతడి కారు ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ మలుపు వద్ద అదుపుతప్పింది. కారు ఒక్కసారిగా మూడు బైకులను ఢీకొట్టింది. ఆ మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. అదే వేగంతో కారు సూపర్ మార్కెట్ వద్దకు దూసుకెళ్లింది. కారు అదుపుతప్పి దూసుకురావడంతో ప్రాణభయంతో అక్కడున్న ప్రజలు అటూ ఇటు పరుగులు తీశారు. కారు నడిపిన రవికు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా.. 550 పాయింట్లు మద్యం మోతాదు ఉన్నట్టు నమోదైంది. కేసు నమోదుచేసి నిందితుడు రవిని ఎస్ఆర్ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎస్ఆర్ నగర్‌లోని సూపర్ మార్కెట్‌లోకి దూసుకెళ్లిన కారు

ప్రియుడిపై బ్లేడ్‌తో దాడి

కంటోన్మెంట్, సెప్టెంబర్ 15: ఐదు సంవత్సరాలుగా ప్రేమలో ఉన్న ప్రియుడిపై బ్లేడ్‌తో దాడి చేసింది. ఈ సంఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై శివశంకర్ వివరాల ప్రకారం..బోయిన్‌పల్లి పెద్ద తోకట్టకు చెందిన హరికృష్ణ ప్లంబర్ పని చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. గత ఐదు సంవత్సరాలుగా న్యూ బోయిన్‌పల్లిలోని కంసారి బజార్‌కు చెందిన అశ్వినిని ప్రేమిస్తున్నాడు. అశ్విని ఓ ప్రైవేటు దవాఖానలో నర్సుగా పనిచేస్తుంది. ఈ ఇద్దరికి హరికృష్ణ తండ్రి యాదయ్య సంవత్సరంలోపు వివాహం చేస్తానని హామీ ఇచ్చా డు. కాగా.. ఈనెల 14న యాదయ్యకు గుర్తు తెలియన వ్యక్తి ఫోన్ చేసి న్యూ బోయిన్‌పల్లి జయనగర్ కాలనీలో వాకింగ్ చేస్తున్న హరికృష్ణ, అశ్వినిల మధ్య గొడవ జరిగిందని, ఈ గొడవలో అశ్విని సర్జికల్ బ్లేడ్‌తో హరికృష్ణ మెడపై దాడి చేసి పరారైందని చెప్పాడు. దీంతో యాదయ్య ఘటనా స్థలానికి చేరుకొని కుమారుడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు దవాఖానకు తరలించాడు. ఈ ఘటనపై యాదయ్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు